సాక్షి
వికారాబాద్
సోమవారం, 27, నవంబర్, 2023



పెద్దేముల్: ప్రచారంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

'పైలెట్'ను సాగనంపుదాం

- బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మకండి
- కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండల గాజీపూర్, పెద్దేముల్, పెద్దేముల్‌తండాతో పాటు గ్రామాలల్లో మనోహర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు లక్షల ఇళ్లు ఇచ్చామని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లుకూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఇచ్చినవాటిని రద్దు చేసి నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ సర్కార్ ఆడుకుంటోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలచి బీఆర్‌ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన పైలెట్ రోహిత్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ ధారాసింగ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, తాండూరు కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ ప్రెసిడెంట్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు నసీర్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, మైపాల్‌రెడ్డి, రియాజ్, కుమార్, లాల్‌రెడ్డి, రవినాయక్, నర్సింహులు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

చర్చి చుట్టూ ప్రహరీ నిర్మిస్తా..

తాండూరు రూరల్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరుపేదలకు అండగా ఉంటానని కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతారం మెథడిస్ట్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మెథడిస్ట్ చర్చి చుట్టు ప్రహరీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అన్నివర్గాలకు న్యాయం చేస్తామన్నారు. నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, ప్రకాశఖ, బెంజిమెన్ అనంతయ్య ఉన్నారు.

కర్ణాటక ఫలితాలే రిపీట్ అవుతాయి



శరణుప్రకాష్ పాటిల్, మనోహర్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

- అక్కడ ఐదు గ్యారెంటీలను పక్కాగా అమలుచేస్తున్నాం
- కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణుప్రకాష్ పాటిల్
- తాండూరులో వీరశైవ సమాజం సభ్యులతో సమావేశం

తాండూరు: కర్ణాటక రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఫలితాలే తెలంగాణలోనూ రిపీట్ అవుతాయని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి శరణుప్రకాష్‌పాటిల్ జోస్యం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరులో వీరశైవ సమాజం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఆయనకు కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శరణుప్రకాష్‌పాటిల్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీని నమ్మి 10 ఏళ్లుగా ప్రజలు మోసపోయారన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కర్ణాటకలో ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీలను పక్కాగా అమలుచేస్తున్నామని.. ఇక్కడ కూడా 6 గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. కర్ణాటక సరిహద్దు వరకు తాను రోడ్డు మార్గాలను వేయించడంతో పాటు కాగ్నానదిపై బ్రిడ్జి నిర్మించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని మార్గాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం ప్రతినిధులు, నాయకులు తదితరులున్నారు.

ఇందిరమ్మ కాలనీలు నిర్మిస్తాం



వికారాబాద్: ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాద్ కుమార్

- కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్
- ఎమ్మెల్యే ఆనంద్ అక్రమ ఆస్తులు కూడబెట్టారని విమర్శ

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ఇందిరమ్మ కాలనీలు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టింపల్లి, గుడుపల్లి, శివారెడ్డిపేట్, ఎన్నెపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కాలనీల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వికారాబాద్ మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధే నేటికీ కనిపిస్తోందని.. బీఆర్‌ఎస్ పార్టీ కేవలం కమీషన్ల కోసం కౌన్సిలర్ల మధ్య గొడవలు పెట్టిందని ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యేకు అభివృద్ధిపై ఏమాత్రం ధ్యాస లేదని విమర్శించారు. సొంత పార్టీ కౌన్సిలర్లను చైర్‌పర్సన్‌పై ఉసిగొలిపి రెండుగా విడదీసినట్లు ఆరోపించారు. దీంతో రెండేళ్లుగా పూర్తిగా అభివృద్ధి ఆగిపోయిందన్నారు.

ప్రతి వార్డుకు 500 ఇళ్లు కట్టించి ఇస్తాం

దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మున్సిపాలిటీలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప ఇళ్లే ఇంకా కనిపిస్తున్నాయని ప్రసాద్ కుమార్ తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరికైనా ఒక్క ఇల్లైనా వచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారానికి వస్తే ఓటర్లు డబుల్ బెడ్ రూమ్ గురించి ప్రశ్నించాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆనంద్‌కు ఎమ్మెల్యే కాకముందు కేవలం రెండు ఎకరాల ఆస్తి మాత్రమే ఉండేదని.. ఇప్పుడు 300 ఎకరాల ఆసామి ఎలా అయ్యారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలకు మేలు జరగాలన్నా, ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలన్నా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి వార్డుకు కొత్తగా 500 ఇళ్ల నిర్మాణం చేసి ఇస్తామన్నారు. 30న జరిగే ఎన్నికల్లో బ్యాలెట్‌లోని 3వ నంబర్‌పై హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరో రెండు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో.. ఒక రోజు ముందుగానే నగరంలో బీజేపీ భారీ రోడ్‌షో చేపట్టనుంది. ప్రచారం ఫైనల్ టచ్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం సాయంత్రం నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి సాయంత్రం 5 గంటలకు రోడ్ షో చేపట్టనున్నారు. టివోలీ హోటల్, నారాయణగూడ ఫ్లై ఓవర్, వైఎంసీఏ మీదుగా కాచిగూడలోని వీరసావర్కర్ చౌరస్తాకు చేరుకోనుంది. గ్రేటర్ పరిధిలోని 24 మంది బీజేపీ అభ్యర్థులతో పాటు సుమారు లక్ష మంది ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉంది. –సాక్షి, సిటీబ్యూరో


హాజరుకానున్న 24 మంది బీజేపీ అభ్యర్థులు

- లక్ష మందికిపైగా పార్టీ శ్రేణులు పాల్గొనే అవకాశం
- కాషాయమయం కానున్న భాగ్య నగరం
- ప్రధాని పర్యటనకు భారీగా బలగాల మోహరింపు
- ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు మోదీ షో



ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి నారాయణగూడ, వైఎంసీఏ, వీరసావర్కర్ చౌరస్తా వరకు రోడ్ షో



2 కి.మీ మేర రోడ్ షో.. కాచిగూడలో ప్రధాని ప్రసంగం..

- ముషీరాబాద్, అంబర్‌పేట్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో రోడ్ షో కొనసాగనుంది. కాచిగూడ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి కమలనాథులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. గ్రేటర్ చరిత్రలో ఓ ప్రధాని స్థాయి వ్యక్తి రోడ్ షో నిర్వహించడం అరుదైన అంశంగా చెప్పుకోవచ్చు.

అప్పట్లోనే అనుకున్నారు కానీ..

- హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా జులైలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశాలకు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్య మంత్రులు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలంతా హాజరయ్యారు. నిజానికి అప్పట్లోనే హైటెక్ సిటీ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వరకు రోడ్‌షో నిర్వహించాలని భావించారు. భద్రతాపరమైన కారణాలతో అనుమతి రాలేదు. దీంతో ఆయన నేరుగా పరేడ్‌గ్రౌండ్ వేదికగా నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు చేరుకోవాల్సి వచ్చింది.
- ఆ తర్వాత బేగంపేటకు చేరుకుని అక్కడే బీజేపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఎస్‌బీ పర్యటనకు వచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహించిన బీసీ సీఎం డిక్లరేషన్ సభలో పాల్గొన్నారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ సభకు హాజరైన మోదీ.. రెండు రోజుల క్రితం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో నగరం నుంచి రాకపోకలు సాగించిన మోదీ.. శ్రీవారి దర్శనార్థం తిరుపతి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం మహబూబాబాద్, కరీంనగర్‌లలో పర్యటించి, సాయంత్రం 4 గంటలకు నగరానికి చేరుకోనున్నారు. ఐదు గంటలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు చేరుకున్న అనంతరం రోడ్ షోలో పాల్గొంటారు.

5 వేల మందితో బందోబస్తు..

ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో పోలీసు విభాగం ఐదు వేల మందితో పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. ఆయన భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) బ్లూ బుక్ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కేంద్ర, పోలీసు బలగాల అధీనంలో ఉన్న రూట్లను సోమవారం ఎస్పీజీ తమ అధీనంలోకి తీసుకోనుంది. రోడ్ షో జరిగే చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున బలగాలు మోహరించనున్నాయి. బందోబస్తు, భద్రత విధుల్లో ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్, శాంతి భద్రతల విభాగంతో పాటు టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొంటాయి. ఆదివారం రాత్రి నుంచే నగర వ్యాప్తంగా నిఘా, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పెద్ద ఎత్తున మఫ్టీ పోలీసులను మోహరించారు. ఆయా ప్రాంతాల్లో నిర్ణీత వేళల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. ఈసారి గగనతల నిఘాను సైతం ఏర్పాటు చేశారు. రూఫ్ టాప్ వాచ్ కోసం రోడ్ షో జరిగే మార్గం చుట్టుపక్కల ఎత్తయిన భవనాలపై సుశిక్షితులైన స్నైపర్స్‌ను మోహరిస్తున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

సోమవారం ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ నుంచి కాచిగూడ ఎక్స్ రోడ్స్ వరకు ప్రధాని నరేంద్రమోదీ రోడ్డు షో నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 గంటల వరకు ఆ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బేగంపేట్, గ్రీన్‌లాండ్స్, పంజగుట్ట, మొనప్ప ఐలాండ్, రాజ్‌భవన్, వీవీ విగ్రహం, నిరంకారీ భవన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, నెక్లెస్ రోటరీ, తెలుగు తల్లి జంక్షన్, కట్టమైసమ్మ ఆలయం, ఇందిరా పార్కు, అశోక్‌నగర్ ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, కాచిగూడ క్రాస్ రోడ్స్ వరకు రోడ్ షో ఉంటుంది. ప్రధాని పర్యటన, రోడ్ షో సందర్భంగా ఆయా రూట్లలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాలలోకి మళ్లిస్తామని అదనపు సీపీ వెల్లడించారు.

కార్తీక శోభ



కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం కృతిక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో దీపాలను వెలిగించారు.

ఈవీఎంలో ఎన్నికల గుర్తు సరిగా కనిపించడంలేదు

చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు బీసీవై అభ్యర్థి సలీం ఫిర్యాదు

పరిగి: ఈవీఎం మెషీన్‌లో తన గుర్తు, ముఖం సరిగా కనిపించడం లేదని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అభ్యర్థి మహ్మద్ సలీం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వికాస్ రాజ్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈసీ తనకు చెరకు రైతు గుర్తు కేటాయించిందని.. అయితే ఈవీఎం మెషీన్‌లో తన గుర్తు, ముఖం పెన్సిల్‌తో గీసినట్లు ఉండటం వలన సక్రమంగా కనిపించడం లేదని వాపోయారు. ముఖభాగం, పెదవులు, గడ్డంభాగం, అసలు కనిపించడం లేదని ఆవేదన చెందారు. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారికి చెబితే పట్టించుకోలేదని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విధుల్లో అలసత్వం వద్దు

- ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి
- ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రిటర్నింగ్, మోడల్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర ఎన్నికల సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. విధి నిర్వహణలో చేపట్టాల్సిన పనులపై జిల్లా ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజున రిటర్నింగ్, సెక్టోరియల్ అధికారుల పాత్ర చాలా కీలకమైందని అన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించేవరకు పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సెక్టోరల్ అధికారులు రెండు రోజులపాటు బీఎల్‌ఓలతో కలిసి ఓటర్ ఎపిక్ కార్డులు, ఓటర్ స్లిప్పులను వందశాతం పంపిణీ చేయాలని సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రతి నాలుగు పోలింగ్ కేంద్రాలకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈనెల 29న ఉదయం 9:30 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎన్నికల సిబ్బందిని మధ్యాహ్నం 1:30 గంటలకు వాహనాల్లో ఎక్కించి పోలీస్ ఎస్కార్ట్‌తో రిటర్నింగ్ అధికారి చూపిన మార్గం ద్వారా మధ్యలో వాహనాలను ఆపకుండా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. సెక్టోరల్ అధికారులు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ తీసుకువెళ్లేటప్పుడు సహకరించాలన్నారు. ఈనెల 28న సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ రాత్రి వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అదే సమయంలో (ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు) మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ చివరిదశకు చేరుకుందని.. ఈ మూడు రోజులపాటు ఎలాంటి డబ్బులు, మద్యం పంపిణీ జరగకుండా ఆర్‌ఓలు, తహసీల్దార్‌లు, పోలీస్ అధికారులు పూర్తి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే ఎఫ్ఎఫ్‌టీ, ఎస్ఎస్‌టీలు పనిచేస్తున్నాయని అవసరం మేరకు అదనంగా సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, డీసీఓ శంకరాచారి, సీపీఓ నిరంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఇవ్వండి..

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు స్వేచ్ఛగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్.. కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. గత రెండు–మూడు రోజులుగా ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్ వేయడానికి పోతే సంబంధిత అధికారులు పలు పొరపాట్లను చూపిస్తూ బ్యాలెట్ పత్రం ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పొరపాట్లను సరిదిద్ది వెంటనే ఉద్యోగులందరూ ఓటువేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో సుమారు 1000 మంది ఉద్యోగుల వరకు ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు కిషన్ నాయక్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



కందనెల్లితండా ప్రచారంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: కాంగ్రెస్‌కు ఓటువేసి ఆగం కావద్దని.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తికి ఓటు వేయాలని తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారన్నారు. దాదాపు 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమిచేసిందో చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బతుకులు బాగుపడాలంటే..

- కాంగ్రెస్ పార్టీకి ఓటేయండి
- పార్టీ పరిగి అభ్యర్థి టీ.రామ్మోహన్‌రెడ్డి


పూడూరు: మన బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆ పార్టీ పరిగి అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కెరవెళ్లి, సోమన్‌గుర్తిలో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, ప్రతీ ఇంటికి ఆరు గ్యారెంటీలను అందిస్తామని అన్నారు. అలాగే మండల పరిధిలోని మన్నేగూడలో టీఆర్‌ఆర్ సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఇచ్చినవాటిని రద్దు చేసి నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ సర్కార్ ఆడుకుంటోందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చని బీఆర్‌ఎస్ పార్టీని బంగాళా ఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఆరు గ్యారెంటీలకు మంచి రెస్పాన్స్ వస్తోందన్నారు. అధికారంలోకి రాగానే వాటిని అములు చేస్తామన్నారు. చేతిగుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు ఆనందం, అజీంపటేల్, షకీల్, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు.. బాలమణి, రఘురాంరెడ్డి, సుభాన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రచార రథంపై మాట్లాడుతున్న టీఆర్‌ఆర్

కొడంగల్‌.. ఎవరో జిగేల్‌

తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోనున్న నియోజకవర్గం. ప్రతీ ఎన్నికలో తమదైన తీర్పునిస్తున్న ఓటర్లు. ఈ ఎన్నికల్లో ఎవరిని ఆశీర్వదిస్తారో అంతుపట్టడం లేదు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నా.. కారు, కాంగ్రెస్‌ మధ్యే టఫ్‌ ఫైట్‌ ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం.





నరేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్‌)



రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్‌)



గురునాథ్‌రెడ్డి



నందారం వెంకటయ్య

ఆది నుంచీ హస్తానిదే హవా

- ఆరు పర్యాయాలు కాంగ్రెస్‌.. ఐదు సార్లు టీడీపీ
- గత ఎన్నికల్లో ఖాతా తెరిచిన కారు
- పోరులో నిలిచేదెవరో..?

కొడంగల్‌: కొడంగల్‌ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఈ ప్రాంత ఓటర్లు ఆరు సార్లు హస్తానికి పట్టం కట్టారు. ఆ తర్వాత టీడీపీ ఐదు సార్లు విజయం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. 2018 ఎన్నికల్లో హోరా హోరీ పోరులో టీఆర్‌ఎస్‌ గెలిచింది. ప్రస్తుత ఎన్నికలు కాంగ్రెస్‌ బీఆర్‌ఎస్‌ మధ్య పోటాపోటీగా జరుగుతున్నాయి. ఇక్కడి ఓటర్ల నాడి నాయకులకు అంతుపట్టక ఆగమవుతున్నారు.

ఒక్కసారి మంత్రి పదవి

నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒకసారి మాత్రమే కొడంగల్‌కు మంత్రి పదవి వరించింది. పీఎన్‌ఆర్‌ గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. ఇప్పుడు ఆయన గెలిస్తే మంత్రి పదవి వస్తుందని ఆయన వర్గీయులు ఆశిస్తున్నారు. నరేందర్‌రెడ్డి మంత్రి పదవి చేపడితే తమ భవిష్యత్‌ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని జిల్లా నేతలు భావిస్తున్నట్లు వినికిడి. 1956లో నియోజకవర్గం ఏర్పడగా నాటి నుంచి 2018 సార్వత్రిక ఎన్నికల వరకు కొడంగల్‌ అసెంబ్లీ స్థానానికి 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. అందులో ఆరు పర్యాయాలు కాంగ్రెస్‌, ఐదు సార్లు టీడీపీ, మూడు సార్లు స్వతంత్రులు, ఒకసారి టీఆర్‌ఎస్‌ అభ్యర్థి విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్‌ ఆధిపత్యం కొనసాగుతోంది. 1957లో తొలి ఎమ్మెల్యేగా అచ్యుతారెడ్డి కాంగ్రెస్‌ నుంచి విజయం సాధించారు. 1962లో రుక్మారెడ్డి, 1972లో నందారం వెంకటయ్య, 1978లో గురునాథ్‌రెడ్డిలు స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనతి కాలంలోనే గురునాథ్‌రెడ్డి హస్తం గూటికి చేరారు. 1983లో టీడీపీ ప్రభంజనలోనూ కాంగ్రెస్‌ అభ్యర్థిగా గురునాథ్‌రెడ్డి గెలిచారు. 1985, 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి నందారం వెంకటయ్య అసెంబ్లీ మెట్లెక్కారు. ఎమ్మెల్యేగా ఉండగానే నందారం వెంకటయ్య చనిపోవడంతో ఉప ఎన్నిక జరిగింది. 1996లో జరిగిన ఈ ఉప ఎన్నికలో టీడీపీ నుంచి నందారం వెంకటయ్య రెండో కుమారుడు సూ ర్యనారాయణ టీడీపీ నుంచి గెలిచారు. 2004 లో గురునాథ్‌ రెడ్డి, 2009, 2014లో రేవంత్‌రెడ్డి, 2018లో పట్నం నరేందర్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్‌, టీడీపీలు తమకు కంచుకోటగా మార్చుకునేందుకు యత్నించారు.

ఉద్యమ కాలంలోనూ 'సైకిల్‌'కే జై

నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పు ఇవ్వడంలో నిష్ణాతులు. 1983లో ఎన్టీఆర్‌ ప్రభంజనంలో ఇక్కడ కాంగ్రెస్‌ విజయం సాధించింది. 2014లో తెలంగాణా ఉద్యమాన్ని లెక్కచేయకుండా కొడంగల్‌ ప్రజలు టీడీపీ పట్టం కట్టారు. ఇక్కడ గురునాథ్‌రెడ్డికి ఐదుసార్లు అవకాశం ఇచ్చిన ప్రజలు నందారం వెంకటయ్యను మూడు సార్లు అసెంబ్లీకి పంపించారు. ఈ ప్రాంతంలో ఒకసారి కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరోసారి టీడీపీని గెలిపించేవారు. 2018 వరకు కాంగ్రెస్‌, టీడీపీ మధ్యనున్న పోరు 2018 నుంచి టీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ మధ్య ప్రధాన పోటీ ఉండింది. అప్పట్లో టీఆర్‌ఎస్‌ అధినేతల చాకచక్యం.. రాజకీయ చతురతను ప్రదర్శించి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి పట్నం నరేందర్‌ రెడ్డిని గెలిపించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ మధ్య పోటీ నెలకొంది. కాగా 2018 ఎన్నికల మాదిరిగా బీఆర్‌ఎస్‌ నేతల రాజకీయ ఎత్తుగడలు పారడం లేదు. అధినేతలు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నరేందర్‌రెడ్డి ఒంటరిగా పోరాటం చేస్తున్నారు. ఆయనకు బీఆర్‌ఎస్‌ నేతలు, మంత్రుల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదని కార్యకర్తలు ఆవేదనలో ఉన్నారు.

కొడంగల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	పేరు	పార్టీ
1957	అచ్యుతారెడ్డి	కాంగ్రెస్‌
1962	రుక్మారెడ్డి	స్వతంత్ర
1967	అచ్యుతారెడ్డి	స్వతంత్ర
1972	నందారం వెంకటయ్య	స్వతంత్ర
1978	గురునాథ్‌రెడ్డి	స్వతంత్ర
1983	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్‌
1985	నందారం వెంకటయ్య	టీడీపీ
1989	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్‌
1994	నందారం వెంకటయ్య	టీడీపీ
1996	ఉప ఎన్నిక/సూర్యనారాయణ	టీడీపీ
1999	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్‌
2004	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్‌
2009	రేవంత్‌రెడ్డి	టీడీపీ
2014	రేవంత్‌రెడ్డి	టీడీపీ
2018	నరేందర్‌రెడ్డి	టీఆర్‌ఎస్‌

ఐటీ దాడులకు భయపడేది లేదు

బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్‌ నేతల తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మానసికంగా దెబ్బతీసేందుకే తన స్నేహితుల ఇళ్లపై ఆదాయపన్ను శాఖాధికారులతో సోదాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తాండూరులోని దుర్గ గ్రాండ్‌, హైదరాబాద్‌లో తన స్నేహితుల ఇళ్లపై ఐటీ అధికారులు దాడులు చేశారని, ఇలాంటి దాడులకు భయపడేది లేదన్నారు. ఎన్నికల సమయంలో కొందరు కాంగ్రెస్‌ నేతలు కుట్రపూరితంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా తన విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. తాండూరు ప్రజలంతా తన వెంటే ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటమి భయంలోనే కాంగ్రెస్‌ అభ్యర్థి తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాండూరు నియోజకవర్గాన్ని రూ.1,670 కోట్లతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సైతం సిద్ధమని సవాల్‌ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర మాజీ కార్యదర్శి పురుషోత్తంరావు, యాలాల జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌, పార్టీ పెద్దేముల్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ తదితరులున్నారు.

బాధితులను ఆదుకుంటా

బషీరాబాద్‌ మండలం దామర్‌చెడ్‌ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు ఎన్నికల ప్రచారానికి హైదరాబాద్‌కు వెళ్తూ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ప్రమాదంలో గాయపడిన మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు.

న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట

బీఆర్‌ఎస్‌ షాద్‌నగర్‌ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్‌

షాద్‌నగర్‌: న్యాయవాదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. షాద్‌నగర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో అడ్వకేట్స్‌ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్‌ఎస్‌ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్‌ మాట్లాడుతూ... రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ఈ ఎన్నికల్లో న్యాయవాదులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించడం హర్షనీయమని అన్నారు. బార్‌ అసోసియోషన్‌ అధ్యక్షుడు వేణుగోపాల్‌ రావు, మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వ్యవస్థను అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. స్వరాష్ట్రంలో న్యాయవాదులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్స్‌ రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌శర్మ, దేశికాచారి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా అనైతిక పాలన



యాలాల: రోడ్‌ షోలో పాల్గొన్న మల్లు రవి, మనోహర్‌రెడ్డి తదితరులు



తాండూరు: మాట్లాడుతున్న మల్లు రవి

- బీఆర్‌ఎస్‌ 15 స్థానాలకే పరిమితం
- కోస్గి బహిరంగ సభను విజయవంతం చేయాలి
- పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, రమేష్‌ మహరాజ్‌

తాండూరు: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అనైతిక పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలు సిద్ధమయ్యారని పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, రమేశ్‌ మహరాజ్‌ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ధర్మానికి.. అధర్మానికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని.. పదేళ్ల బీఆర్‌ఎస్‌ అరాచక పాలనలో ప్రజలు ఇబ్బంది పడ్డారని.. హస్తానికే ఓటేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ప్రభుత్వ పథకాలన్ని వారి పార్టీ నాయకులకే దక్కాయన్నారు. ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్‌ 15 స్థానాలకు మించి గెలవదన్నారు. కాంగ్రెస్‌కు వెన్ను పోటు పొడిచిన రోహిత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మచ్చలేని మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌ నేతల ప్రచారానికి అనుమతులు ఇవ్వని అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ కలిసి కాంగ్రెస్‌ అభ్యర్థులపై ఐటీ దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అనంతరం బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోహిత్‌రెడ్డి ఐదేళ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌ గ్యారెంటీ పథకాలే తనను గెలిపిస్తాయన్నారు.

ప్రియాంకగాంధీ సభను సక్సెస్‌ చేద్దాం

కొడంగల్‌ నియోజవకర్గ పరిధిలోని కోస్గిలో ప్రియాంక గాంధీ హాజరయ్యే బహిరంగ సభకు తాండూరు నియోజకవర్గం నుంచి 30 వేల మంది తరలివేళ్లేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరులో పార్టీ అధినేతల ప్రచారానికి జిల్లా అధికారులు అనుమతులు ఇవ్వలేదని.. వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అందరం సంయకుక్తం కోస్గి బహిరంగ సభను సక్సెస్‌ చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు రఘువీర్‌ రెడ్డి, ధారాసింగ్‌, బషీరాబాద్‌ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేష్‌మహరాజ్‌, నాయకులు మురళీకృష్ణగౌడ్‌, ఉత్తమ్‌చంద్‌, జనార్ధన్‌రెడ్డి, సాయిజూర్‌ బాల్‌రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు, లొంక నర్సింలు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ దౌర్జన్యాలకు చెక్‌ పెడతాం

యాలాల: బీఆర్‌ఎస్‌ పాలనలో సామాన్యులపై నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలు పెరిగాయని.. త్వరలో వీటన్నంటికి కాంగ్రెస్‌ ప్రభుత్వం చెక్‌ పెడుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి అన్నారు. ఆదివారం ఆయన యాలాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికార పార్టీ నాయకులకు పోలీసులు తోడయ్యారని ఆరోపించారు. నవంబరు 30న ప్రజలంతా హస్తం గుర్తుకు ఓటేసి మనోహర్‌రెడ్డిని దీవెంచాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా లేని వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియా, భూకబ్జాజలు, సుద్ద మాఫియా నిలువరించాలంటే కాంగ్రెస్‌ పార్టీకే అవకాశం ఇవ్వాలని కోరారు. 30 క్రితమే శ్రీనివాస రైస్‌మిల్లు పేరిట తనకు వ్యాపారం ఉందని.. ఇక్కడి రైతులు, సామాన్యులకు తన పరిచయం కొత్తగా అవసరం లేదన్నారు. అధికార నాయకుల దుష్ప్రచారాలు నమ్మొద్దని తానే పక్కా లోకల్‌ అభ్యర్థినని వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, యాలాల సొసైటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు కోర్వని అమృతప్ప, నాయకులు హన్మంతు, మహిపాల్‌, రాజేందర్‌ రెడ్డి, గంతల మైనుద్దీన్‌, నాగప్ప, జిలానీ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

కొడంగల్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని రేవంత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్‌ 9న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. తొలి సంతకం ఆరు గ్యారెంటీలపైనే ఉంటుందని వివరించారు. అసైన్డ్‌, పోడు భూములను క్రమబద్ధీకరిస్తామన్నారు. సోమవారం కోస్గిలో మధ్యాహ్నం 2 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా భారీ బహిరంగ సభ ఉంటుందని ప్రజలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ అధినేతలు అవమానించినందునే తాను తిరస్కరించానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి రేవంత్‌ గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌, కౌన్సిలర్‌ శంకర్‌ నాయక్‌, మాజీ సర్పంచ్‌ సంజీవరెడ్డి, తౌర్యానాయక్‌ పాల్గొన్నారు.

36 లీటర్ల మద్యం సీజ్‌



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

చేవెళ్ల: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్‌ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను చేవెళ్ల ఎక్సైజ్‌ సీఐ శ్రీలత వెల్లడించారు. శంషాబాద్‌ జిల్లా ఎక్సైజ్‌ అధికారి సత్యనారాయణ సూచనల మేరకు అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్‌, చేవెళ్ల ఎక్సైజ్‌ టీమ్‌లు శనివారం రాత్రి చేవెళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఓ వ్యక్తి కారులో 36 లీటర్ల మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, మద్యాన్ని, స్వాధీనం చేసుకొని, కారును సీజ్‌ చేసి.. కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా మద్యాన్ని తరలించినా.. నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

625 మంది బైండోవర్‌

ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు

యాచారం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు కోరారు. సాగర్‌రోడ్డుపై మాల్‌లో ఏర్పాటు చేసిన చెక్‌ పోస్టును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో 34 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. పాత నేరస్తులు, గత ఎన్నికల సమయాల్లో కేసులు నమోదైన 625 మందిని ముందస్తుగా బైండోవర్‌ చేశామన్నారు. ఈ నెల 30న పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసేలా స్థానిక పోలీస్‌ స్టేషన్ల సిబ్బందితో పాటు 700 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించామని వివరించారు. ఘర్షణలు, ఓటర్లను భయపెట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటు అమ్ముకుంటే హక్కులు కోల్పోతాం

జై భారత్‌ జస్ట్‌ ఓట్‌ క్యాంపెయిన్‌ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

తాండూరు టౌన్‌/అనంతగిరి: ఓటు అమ్ముకుంటే ప్రశ్నించే హక్కును కోల్పోతామని జై భారత్‌ జస్ట్‌ ఓట్‌ క్యాంపెయిన్‌ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గోల అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకుగాను ఆదివారం పట్టణంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులు డబ్బు, మద్యం ఎర చూపి ఓటును కాజేస్తారన్నారు. ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. పదిహేనేళ్లుగా జై భారత్‌ నోటుకు ఓటును వ్యతిరేకిస్తూ ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రతి ఓటరు చైతన్యంతో నిస్వార్థంగా సేవ చేసే అభ్యర్థికి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాతీయ అధికార ప్రతినిధి మల్లికా వల్లభ, జాతీయ సమితి సభ్యురాలు లక్ష్మీశ్రీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఖలీల్‌, ఆటో స్టాండ్‌ నాయకులు గౌస్‌, షఫీ, జావేద్‌, సద్దాం, మోసిన్‌ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న జై భారత్‌ జస్ట్‌ ఓట్‌ క్యాంపెయిన్‌ కమిటీ సభ్యులు

ముదిరాజ్‌లకు సముచిత స్థానం

బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు కాసాని

- చేవెళ్లలో ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల: ముదిరాజ్‌ సామాజిక వర్గానికి సుముచిత స్థానం కల్పిస్తామని సీఎం కేసీఆర్‌ హామీ ఇచ్చారని.. అందుకే కారుకు మద్దతిస్తున్నామని ముదిరాజ్‌ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ ప్రకటించారు. ఆదివారం చేవెళ్ల బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కాలె యాదయ్య ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. కేసీఆర్‌ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ.. అన్ని వర్గాలను గౌరవిస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ముదిరాజ్‌లకు అండగా నిలుస్తోందని తెలిపారు. యాదయ్యకు ముదిరాజులు మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని ఆకాంక్షించే కేసీఆర్‌ ముదిరాజ్‌లకు న్యాయం చేస్తారని కాలె యాదయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వెంకటేశ్‌, నాగారాజు, నర్సింలు, శ్రీకాంత్‌, గణేశ్‌, శ్రీనివాస్‌, ముదిరాజ్‌ సంఘం నాయకులు తదితరులున్నారు.

కారుకు ఓటేస్తేనే సంక్షేమం

మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సేవకుడిగా అండగా ఉంటానని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తంగడపల్లి, మడికట్టు, తలారం, దుద్దాగు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, ఇతర పార్టీల అభ్యర్థుల మాటలు నమ్మి ఓటు వేస్తే ఆగమవుతారని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చానని గుర్తుచేశారు. సేవకుడిగా పనిచేసే నాయకుడు కావాలా లేక వివాదాలకు కారణమయ్యే నాయకులు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు గ్రామాలు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో గమనించాలన్నారు. తాగునీటి సమస్యను తీర్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400లకే సిలిండర్‌ అందిస్తారని చెప్పారు.

యాదయ్యను నిలదీసిన గ్రామస్తులు

తంగడపల్లి, దుద్దాగు గ్రామాలకు చెందిన ప్రజలు, యువకులు తమ గ్రామాల్లో సమస్యలు అలాగే ఉన్నాయని వాటిని పరిష్కరించలేదని యాదయ్యను ప్రశ్నించారు. తమ ఊరికి బస్సు సౌకర్యం లేదని తలారం గ్రామస్తులు నిలదీశారు. ఎన్నికల కోడ్‌ అనంతరం అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అనూషగౌడ్‌, సురేందర్‌, శివారెడ్డి, వెంకటేశంగుప్తా, భీమయ్య, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, కిష్టయ్య, నాయకులు నాగార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్‌, వైస్‌ ఎంపీపీ శివప్రసాద్‌ పాల్గొన్నారు.



ముదిరాజ్‌ ఆత్మీయ సమ్మేళనంలో కాసాని, యాదయ్య తదితరులు

ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజాసంక్షేమం

కాంగ్రెస్‌ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్‌: ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏంటో, తానేంటో చూపిస్తానని కాంగ్రెస్‌ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని సాలార్‌పూర్‌ గ్రామంతో పాటు పలు తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు, రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ప్రతీ నెల రూ.2,500తో పాటు, రూ.500కే వంట గ్యాస్‌ సిలిండర్‌, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ అందజేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీని గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, అందరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌, సర్పంచ్‌ విజయలక్ష్మి, శంకర్‌, యాదగిరిరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'గులాబీ' మోసాలను గుర్తించాలి




చేవెళ్ల: మైనార్టీల సమ్మేళనంలో మాట్లాడుతున్న భీంభరత్‌

- చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌ జెండా ఎగురవేద్దాం
- ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్‌

చేవెళ్ల: గులాబీ నేతల మోసాలను ముస్లిం, మైనార్టీలు గుర్తించి ఓటుతో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్‌ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్‌ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ నాటి నుంచి మైనార్టీలకు అండగా ఉంటుందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌ రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి హామీని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు వాజిద్‌, ఫరూక్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీని గెలిపిస్తేనే పేదలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని పామెన మాజీ సర్పంచ్‌ డి.గోపాల్‌ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇంటింటికీ ప్రచారం చేస్తూ గ్యారెంటీ కార్డులను అందజేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఈ ప్రచారంలో ఎర్రగోపాల్‌, రాజేందర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: భీంభరత్‌కు స్వాగతం పలుకుతున్న చిన్నన్నగూడ గ్రామస్తులు

విజయం ఖాయం

శంకర్‌పల్లి: చేవెళ్ల అసెంబ్లీలో కాంగ్రెస్‌ పార్టీ విజయం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్‌ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడ, చిన్నన్నగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కె.ఉదయమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీకాంత్‌, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌, సత్యం, నర్సింలు, గోపాల్‌, రాందాస్‌, ప్రశాంత్‌, నరేష్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.